క్లుప్తంగా

ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు

వైఎస్సార్ సీపీ సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్



గుంటూరు రూరల్: నియోజకవర్గంలోని ప్రజలు భోగ భాగ్యాలతో సుఖ సంతోషాలతో మెలగాలని వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్ ఆకాంక్షించారు. నియోజకవర్గం ప్రజలకు భోగి, సంక్రాంతి, కనుమ శుభాకాంక్షలు తెలిపారు. ఈ ఏడాది పంటలు బాగా పండి ప్రతి రైతు, ప్రతి ఒక్కరూ సంతోషంగా జీవించాలని కోరారు.

ఆదికేశవస్వామికి తులసి దళ కైంకర్యం



చేబ్రోలు: ఖ్యాతిగాంచిన చేబ్రోలులోని ఆదికేశవస్వామి దేవస్థానంలో ధనుర్మాసం సందర్భంగా ఆదివారం తులసిదళ కైంకర్యం వైభవంగా జరిగింది. ఆదికేశవస్వామికి 1008 నామావళితో తులసి దళార్చన చేశారు. తులసీ దళయుక్త సహస్రనామార్చన, అభిషేకాలను ఆలయ అర్చకులు పణిహారం శ్రీధర్ ఘనంగా నిర్వహించారు.

ఉత్సాహంగా సంక్రాంతి సంబరాలు



ప్రత్తిపాడు: సంప్రదాయాలకు ప్రతీక సంక్రాంతి అని తేళ్ల నారాయణ విజ్ఞాన కేంద్రం ట్రస్టు కన్వీనర్ దొప్పలపూడి రమేష్ బాబు అన్నారు. మండల పరిధిలోని పాలపర్రులో ఆదివారం ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ, ఐద్వా, రైతు సంఘం ఆధ్వర్యంలో సంక్రాంతి ఆటల పోటీలు నిర్వహించారు. నడక, లెమన్ అండ్ స్పూన్, స్పీడ్ వాకింగ్, మ్యూజికల్ చైర్స్, మోకు లాగుట, పరుగు పందెం పోటీల్లో చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. గెలుపొందిన విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రమేష్‌బాబు, జంపని రామారావు, ముద్దన వెంకటేశ్వర్లు, జంపని రఘురాం, ముద్దన సుధాకిరణ్ పాల్గొన్నారు.

ఐపీఎస్ అధికారి సునీల్‌కుమార్‌పై వ్యాఖ్యలు సిగ్గు చేటు



నెహ్రూనగర్: ఐపీఎస్ అధికారి పీవీ సునీల్‌కుమార్‌పై వ్యక్తిగత అంశాలపై అసెంబ్లీ డెప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు చేసిన వ్యాఖ్యలు సిగ్గు చేటు అని జాతీయ మాల సంఘాల జేఏసీ అధ్యక్షుడు అన్నవరపు కిషోర్ పేర్కొన్నారు. ఆదివారం లాడ్జిసెంటర్‌లో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పీవీ సునీల్‌కుమార్, ఆయన కుటుంబ సభ్యులను కించపరిచే విధంగా మాట్లాడటం బాధాకరమని చెప్పారు. సునీల్ వ్యక్తిగత విషయాల జోలికి వస్తే సహించేది లేదని హెచ్చరించారు. దళితుల కుటుంబాలకు చెందిన వారు విదేశాలకు వెళ్లకూడదా..ఉన్నత విద్య చదవకూడదా అని సూటిగా ప్రశ్నించారు. ఆయన గురించి ఈ సారి అవాకులు చవాకులు పేలితే ఉద్యమిస్తామన్నారు. విలేకరుల సమావేశంలో జేఏసీ నాయకులు చైతన్య, విద్యాసాగర్, శేషయ్య, ప్రసాద్ వర్మ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శ్రీరామమహా సామ్రాజ్య పట్టాభిషేకం



నగరంపాలెం: స్థానిక మారుతీనగర్ శ్రీకంచి కామకోటి పీఠ శ్రీ మారుతీ దేవాలయ ప్రాంగణంలో శ్రీరామమహా సామ్రాజ్య పట్టాభిషేకం మహోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. శ్రీమారుతీ దేవాలయం, శ్రీరామ సేవా సమితి (వారణాసి) సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించగా, శ్రీమద్ వాల్మీకి విరచిత శ్రీమద్రామాయణ అష్టోత్తర శత పారాయణ పూర్వక శ్రీరామ మహా సామ్రాజ్య పట్టాభిషేకం నిర్వహించారు. శ్రీ సీతారామచంద్రస్వామి సపరివార సమేతంగా అభిషేకం చేపట్టారు. ఈ అభిషేకం నదుల నీళ్లు అని సుగంధ ద్రవ్యాలు, పంచామృతాలతో వేద పండితులతో వివిధ సూక్తముల పారాయణం నడుమ నిర్వహించారు. పారాయణదారులందరూ హాజరవ్వగా, భక్తులకు అన్న ప్రసాదం చేశారు. పాలక మండలి సభ్యులు కొరపాటి రామారావు, శ్రీరామ సేవాసమితి నిర్వాహకులు డాక్టర్ యూవీ సోమయాజులు పాల్గొనగా, కార్యక్రమాలను కార్యదర్శి తంగిరాల శ్రీనివాస్ పర్యవేక్షించారు.

సంక్రాంతి సందడిలో 'తెలుగులోగిళ్లు'

- స్వగ్రామాలకు చేరుకుంటున్న బంధువులు
- సంప్రదాయ వేదికపై సంక్రాంతిని చేసుకునేందుకు సిద్ధం
- ముచ్చటైన పండుగ, మూడు రోజుల వేడుక
- నేడు భోగి పండుగ



ఎగసి పడుతున్న భోగి మంటలు

ప్రత్తిపాడు: పాల పొంగళ్లు.. రంగుల ముంగిళ్లు.. ముద్దుగొలిపే గొబ్బిళ్లు.. బసవన్నల విన్యాసాలు.. హరిదాసుల కీర్తనలతో తెలుగు లోగిళ్లన్నీ ఆనంద పరవళ్లతో కళకళలాడుతున్నాయి. తెలి మంచు దుప్పట్లు, కొత్త అల్లుళ్లు, కొంటె మరదళ్లు, పట్టు పరికిణీల రెపరెపలతో మూడు రోజులపాటు సంప్రదాయ వేదికపై సప్తవర్ణాల శోభతో సంకురాతిరి జరుపుకునేందుకు పల్లెలన్నీ ముస్తాబయ్యాయి.

కళకళలాడుతున్న తెలుగు లోగిళ్లు..

బంధువులు, స్నేహితులు, కొత్త అల్లుళ్లు, కోడళ్లు, మనవరాళ్ల రాకతో తెలుగు లోగిళ్లు కళకళలాడుతున్నాయి. ఎప్పుడో నెలల క్రితం వినిపించిన ఆప్యాయపు పిలుపులకు, మూటగట్టుకున్న మమతానురాగాలు తోడవడంతో ఆనందాలకు అవధు లేకుండా పోయాయి. తాతలు, నానమ్మలు, అమ్మమ్మలు మనవళ్లపై ప్రేమ వర్షం కురిపిస్తున్నారు. ఊరంతా షికార్లు కొడుతుండటంతో పండుగశోభ కొట్టొచ్చినట్లు కనిపిస్తుంది.

నేడు భోగి...

సంక్రాంతి సంబరాలలో ప్రతి ఒక్కరూ ముందుగా జరుపుకునే పండుగ భోగి. దక్షిణాయనంలో ప్రజలు తాము పడిన కష్టాలను, బాధలను అగ్నిదేవుడికి ఆహుతి చేస్తూ, రాబోయే ఉత్తరాయణంలో తమకు సుఖశాంతులను ప్రసాదించాలని కోరుతూ భోగి మంటలను వేస్తారనేది పెద్దలమాట. అంతేకాకుండా భోగి నాడు చలిగాలులను పారదోలి ఇంటిలోని పాత సామానులను మంటల్లో తగులబెట్టేందుకు ఊరూవాడా కోడి కూతకన్నా ముందుగానే మేల్కొంటాయి. కొందరు భోగి మంటలపై ఇత్తడి బిందెల్లో నీళ్లు కాచుకుని ఆ నీటితో స్నానం చేయడం పూర్వం నుంచి ఆచారంగా వస్తుంది. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. భోగి పేరంటాళ్లు నిర్వహిస్తారు. చిన్నారులకు భోగి పళ్లు పోసి తల్లిదండ్రులు మురిసిపోతారు. సకలశుభాలు కలగాలని ఆశీర్వదిస్తారు. సోమవారం భోగిని అంగరంగవైభవంగా జరుపుకునేందుకు సిద్ధమవుతున్నారు.

కుక్కల బెడదతో బెంబేలు



తహసీల్దార్ కార్యాలయం వద్ద కుక్కలు

పొన్నూరు: పట్టణంలో కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. చిన్నపిల్లలు, వృద్ధులు వీధుల్లోకి రావాలంటే భయపడాల్సిన పరిస్థితి. పట్టణ పరిధిలోని డఫ్‌పేట, డీవీసీ కాలనీ, అంబేడ్కర్ నగర్, ముబారక్ నగర్, ఇందిరా నగర్ కాలనీ ప్రాంతాలతో పాటు ప్రధాన రహదారుల్లో కూడా కుక్కల బెడద ఎక్కువైంది. రాత్రివేళల్లో ఒంటరిగా వెళ్లాలంటే భయపడాల్సిన పరిస్థితి. ద్విచక్ర వాహనాలు, కార్లు, సైకిళ్లపై వెళ్లేవారిని కుక్కల గుంపులుగా వెంబడించి గాయపరుస్తున్నాయని ప్రజలు వాపోతున్నారు.

చోద్యం చూస్తున్న యంత్రాంగం

మున్సిపాలిటీలోని అన్ని వీధుల్లో కుక్కలు స్వైరవిహారం చేస్తున్నప్పటికీ అధికార యంత్రాగం చోద్యం చూస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కుక్కల బెడదతో అల్లాడుతున్నామని ఒంటరిగా రోడ్డు మీదకు రావాలంటే భయపడుతున్నామని మహిళలు వాపోతున్నారు. మున్సిపల్ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినప్పటికీ వారు స్పందించడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

స్వామి వివేకానందని స్ఫూర్తిగా తీసుకోవాలి



నారాకోడూరు హైస్కూల్‌లో వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, ఎన్‌సీసీ క్యాడెట్లు

చేబ్రోలు: భారత దేశ సంస్కృతి సంప్రదాయాలను, విలువలను ప్రపంచానికి తెలియజేసిన మహోన్నత వ్యక్తి స్వామి వివేకానందను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని నారాకోడూరు జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం ఎం.ఏడుకొండలు పేర్కొన్నారు. చేబ్రోలు జెడ్పీ హైస్కూల్‌లో ఆదివారం స్వామి వివేకానంద జయంతి, జాతీయ యువజన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వివేకానంద ఆశయాలు, సందేశాన్ని తెలియజేశారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ ఉపాధ్యాయులు టి.దుర్గాబాయి, సీహెచ్ నాగేశ్వరావు, ఉమామహేశ్వరి పాల్గొన్నారు

పెదకాకాని గ్రామంలో..



పెదకాకానిలో వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

పెదకాకాని: స్థానిక శాఖా గ్రంథాలయంలో ఆదివారం స్వామి వివేకానంద జయంతి నిర్వహించారు. గ్రంథాలయాధికారి వేముల విజయకుమార్ ఆధ్వర్యంలో యువజన దినోత్సవం సందర్భంగా వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. వివిధ అంశాల్లో పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు. గ్రంథాలయాధికారి వేముల విజయకుమార్ మాట్లాడుతూ స్వామి వివేకానందుని జీవిత విశేషాలను విద్యార్థులకు వివరించారు. తొలుత వివేకనందా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ఉత్సాహంగా సంక్రాంతి రంగ వల్లుల పోటీలు



రంగ వల్లులను పరిశీలిస్తున్న కమిషనర్ పులి శ్రీనివాసులు, ఎమ్మెల్యే గల్లా మాధవి

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ మునిసిపల్ క్రీడా ప్రాంగణంలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా ఆదివారం ప్రారంభమైన రంగవల్లుల పోటీలు నేలకు హరివిల్లులను అద్దాయి. తెలుగు సంస్కృతి, సంప్రదాయాలను చాటేలా నగరపాలక సంస్థ సంక్రాంతి సంబరాలు జరుగుతున్నాయని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు పేర్కొన్నారు. రంగవల్లుల పోటీల్లో 72 మంది పాల్గొన్నారని, పాల్గొన్న ప్రతి ఒక్కరికీ పార్టిసిపేషన్ బహుమతులు అందిస్తామన్నారు. సోమవారం నుంచి నిర్వహించనున్న సంక్రాంతి సంబరాలకు తెలుగు సంప్రదాయాన్ని చాటే వస్త్రధారణతో రావాలని కోరారు. ఎమ్మెల్యే గల్లా మాధవి మాట్లాడుతూ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో జరుగుతున్న సంక్రాంతి సంబరాలు గుంటూరు నగరానికి సంప్రదాయకమైన సొబగులు తెచ్చాయన్నారు. రంగవల్లుల పోటీల్లో మహిళలు చాలా ఉత్సాహంగా పాల్గొన్నారని, ఇదే ఉత్సాహంతో మరో మూడు రోజులపాటు జరిగే సంబరాల్లో పాల్గొనాలని కోరారు. అనంతరం రంగవల్లుల పోటీల్లో జి.సురేఖ, పి.సుజాత, టి.భారతిలకు వరసగా మొదటి, ద్వితీయ, తృతీయ బహుమతులు, పోటీల్లో పాల్గొన్న 6వ తరగతి విద్యార్థిని సుప్రతికి ప్రత్యేక బహుమతి, మరో 5 మందికి కన్సొలేషన్ బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో డెప్యూటీ కమిషనర్లు డి.శ్రీనివాసరావు, సీహెచ్.శ్రీనివాస్, టి.వెంకట కృష్ణయ్య, సిటీ ప్లానర్ రాంబాబు, ఎంహెచ్ఓ డాక్టర్ రవిబాబు, నిర్వహణ కమిటీ సభ్యులు డి.శ్రీనివాసరావు, విజయలక్ష్మి, కాశయ్య, నసీర్ అహ్మద్, లోకేశ్వరరావు పాల్గొన్నారు.

ఉదయం 6 గంటల నుంచే సంక్రాంతి వేడుకలు

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ మునిసిపల్ క్రీడా ప్రాంగణంలో సంక్రాంతి సంబరాలు రెండో రోజు సోమవారం ఉదయం 6 గంటల నుంచి ప్రారంభమవుతాయని కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. వీఐపీలకు పూర్ణకుంభ స్వాగతం, సన్నాయి మేళం, భోగి మంటలు, గంగిరెద్దుల విన్యాసాలు, హరిదాసుల ఆటపాటలు, ఫుడ్ స్టాల్స్ ప్రారంభం, చిన్నారులకు భోగి పళ్లు, తాడులాగుట, లెమన్ అండ్ స్పూన్, మ్యూజికల్ చైర్ పోటీలు జరుగుతాయని చెప్పారు. సాయంత్రం 5 గంటల నుంచి 10 గంటల వరకు డప్పు వాయిద్యం, తంబోలా, సంప్రదాయ వస్త్ర పోటీలు(మహిళలు, చిన్న పిల్లలకు), చెక్క భజన, కూచిపూడి, ఫోక్ డ్యాన్స్ పోటీలు ఉంటాయని కమిషనర్ చెప్పారు.

పేదలకు సేవ చేయడం అదృష్టం

గుంటూరు ఎడ్యుకేషన్: పేదలకు సేవ చేసే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నామని మద్దు రామకృష్ణయ్య చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు మద్దు రామకృష్ణయ్య పేర్కొన్నారు. ఆదివారం చుట్టుగుంట సెంటర్‌లోని లీలా గాయత్రి కోల్డ్ స్టోరేజీలో 250 మంది పేద వృద్ధులు, రోగులకు రూ.400 చొప్పున నాలుగు నెలల పింఛన్ రూ.ఐదు లక్షలను తమ కుటుంబ సభ్యులతో పాటు ఆవోపా నాయకులతో కలసి అందజేశారు. ఈసందర్భంగా రామకృష్ణయ్య మాట్లాడుతూ వాసవీ మాత కృప, ఆశీస్సులతోనే పేద ప్రజలకు గత ఎనిమిది ఎనిమిదేళ్లుగా సేవ చేసే భాగ్యం తనకు దక్కిందని అన్నారు. వ్యాపార పరంగా ఆర్జించిన దానిలో కొంత మొత్తాన్ని పేద విద్యార్థులకు ఉపకార వేతనాలు, వైద్య సేవా శిబిరాల నిర్వహణ, వృద్ధులు, రోగులకు ఇతోధికంగా చేయూతనందిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఆవోపా రాష్ట్ర అధ్యక్షుడు తటవర్తి రాంబాబు, మద్దు జయలక్ష్మి చారిటబుల్ ట్రస్ట్ డైరెక్టర్లు డాక్టర్ వైష్ణవి భావన్నారాయణ, శ్రీమన్నారాయణ పాల్గొన్నారు.

నేడు పెదనందిపాడులో గ్రామీణ క్రీడాపోటీలు

ప్రత్తిపాడు: సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని మండల కేంద్రం పెదనందిపాడులో సోమ, మంగళవారాల్లో కొల్లా వెంకయ్య మెమోరియల్ గ్రామీణ క్రీడా పోటీలు నిర్వహించనున్నారు. అచ్చనగల్లాలు, దాడీ ఆట, అష్టాచెమ్మ (నాలుగు గళ్లు), తొక్కుడుబిళ్ల, బచ్చాలాట, గోలీలాట, బొంగరాలాట, కుందుళ్లు, కోలాట పోటీలు, 14వ తేదీన స్లో సైక్లింగ్, కాలితో కొబ్బరికాయ విసిరేయడం, శ్రీశ్రీ గేయాలు, మ్యూజికల్ చైర్స్, కుండ కొట్టడం పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

అగ్ని ప్రమాదంలో ఆటోలు దగ్ధం



పొన్నూరు: పట్టణంలోని బాపట్ల రోడ్డులో చోటుచేసుకున్న అగ్నిప్రమాదంలో రెండు ఆటోలు దగ్ధమయ్యాయి. ఈ ఘటన ఆదివారం చోటుచేసుకుంది. స్థానికులు ఫైర్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వడంతో సిబ్బంది వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. అగ్నిమాపక కేంద్రం అధికారి కె. ప్రసాదరావు తెలిపిన వివరాల ప్రకారం చెత్త వ్యర్థాలకు నిప్పంటుకుని ప్రమాదవశాత్తు ఆటోలకు మంటలు వ్యాపించి అగ్ని ప్రమాదం చోటు చేసుకుందని తెలిపారు.

అలరించిన అలనాటి సినీ సౌరభాలు

నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం పద్మావతి కళ్యాణవేదికపై ఆదివారం మహతి స్వరసుధ రజతోత్సవాలు నిర్వహించారు. సంస్థ అధ్యక్షులు పత్రి నిర్మల ఆధ్వర్యంలో జరగ్గా, గాయనీ గాయకులు సిహెచ్.రాజ్యలక్ష్మి, జరీనా, వై.హేమమాలిని, డాక్టర్ జె.ముకుంద ప్రియ, టి.రమాదేవి, వి.రాజేశ్వరిదేవి, జె.రేష్మ, ఎన్.కృష్ణ, నాగపల్లవి, ప్రద్యుమ్న తదితరులు అల నాటి సినీ సౌరభాలను అలపించారు. శ్రోతలను అలరించాయి. కీబోర్డుపై కె.రవిబాబు, తబలపై ఎస్.వెంకట్, ప్యాడ్స్‌పై వి.ప్రసాద్ వాయిద్యాన్ని అందించారు. కార్యక్రమంలో డాక్టర్ నరసింహారావు, ఆలయ పాలకమండలి అధ్యక్షులు సిహెచ్.మస్తానయ్య, కోటా సాంబశివరావు, పట్టస్వామి గోపాల కృష్ణమూర్తి, కొడాలి వీరభద్రరావు పాల్గొనగా, కార్యక్రమాలను కె. మదన్ మోహన్ నిర్వహించగా, వ్యాఖ్యతగా బి.కృష్ణప్రసాద్ వ్యవహరించారు.

ఆయుర్వేదంతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యం

లక్ష్మీపురం: ఆయుర్వేద వైద్యంతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని ప్రముఖ ఆయుర్వేద వైద్యుడు పీఎస్ఆర్ శివ కళ్యాణ్ అన్నారు. అరండల్ పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి అధ్యక్షతన ఆదివారం ఆరోగ్య సభ నిర్వహించారు. సభకు విశ్లేషకులు వీవీ రావ్ అధ్యక్షత వహించారు. డాక్టర్ మాట్లాడుతూ పురాతన కాలం నుంచి ఆయుర్వేదం మన జీవన విధానంలో భాగంగా ఉందని చెప్పారు. ఈ రోజుల్లో తరచుగా వచ్చే జ్వరం, దగ్గు, జలుబు వంటి ఇన్ఫెక్షన్లకు ఎటువంటి సైడ్ ఎఫెక్ట్ లేకుండా ఆయుర్వేదంతో నయం చేసే వీలుందని వివరించారు.

వృద్ధులు, దివ్యాంగులకు బియ్యం పంపిణీ



నగరంపాలెం: అందరూ ఉండి అనేక మంది కుటుంబ సభ్యులకు దూరంగా ఉంటున్నారని, ఒంటరిగా ఉండే వయో వృద్ధులు, దివ్యాంగులకు ఇతోధికంగా సహాయ సహకారాలు అందించాలని శ్రీహనుమాన్ ఆదర్శ సేవా సమితి అధ్యక్షుడు మామిడి మురళీకృష్ణ అన్నారు. కొత్తపేటలోని సమితి కార్యాలయంలో ప్రతి నెల రెండో ఆదివారంలో భాగంగా వయోవృద్ధులు, దివ్యాంగులకు బియ్యం, 11 రకాల నిత్యావసర వస్తువుల కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏళ్ల తరబడిగా సమితి ద్వారా వందలాది మందికి ఉచితంగా సేవలు అందిస్తున్నామని అన్నారు. దాతల సహకారాలతో మరెన్నో కార్యక్రమాలు చేపడతామని చెప్పారు. కార్యక్రమంలో కార్యదర్శి మాదాల ప్రకాష్, కోశాధికారి ఎస్‌వీ.రమణ, సహాయ కార్యదర్శి పలకలూరి శివరావు, మాజీ అధ్యక్షుడు నేరెళ్ల కొండలరావు, మామిడి వెంకటశ్రావణ్ పాల్గొన్నారు.

సంక్రాంతి సంబరాల్లో అలరించిన ముగ్గులు



ముగ్గుల పోటీలలో మహిళలు వేసిన ముగ్గులు



విజేతలతో ఆలయ కమిటీ చైర్మన్ అంజిరెడ్డి, ఎంపీపీ పద్మావతి తదితరులు

గుంటూరు రూరల్: నల్లపాడు చల్లావారిపాలెం గ్రామ ప్రజల ఇలవేల్పు ఘంటాలమ్మతల్లి పుట్టలమ్మతల్లి సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటుతున్నాయి. ఆదివారం ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. రెండు రోజులుగా జరుగుతున్న షటిల్ టోర్నమెంట్ ముగిసింది. మధ్యాహ్నం కార్యక్రమంలో భాగంగా మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ముగ్గుల పోటీలలో పోటాపోటీగా పలు జిల్లాల నుంచి మహిళలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ ఇంటూరి అంజిరెడ్డి మాట్లాడుతూ ప్రతి ఏటా నిర్వహించే శ్రీ పుట్టలమ్మ తల్లి సంక్రాంతి సంబరాలలో భాగంగా నిర్వహించిన ముగ్గుల పోటీకి ఈ ఏడాది అనూహ్య స్పందన లభించిందన్నారు. ఎంపీపీ ఇంటూరి పద్మావతి మాట్లాడుతూ సంప్రదాయ పద్ధతిలో నిర్వహించిన చుక్కల ముగ్గుల పోటీలు నిర్వహించడం అభినందనీయమని చెప్పారు. గుంటూరుకు చెందిన రావూరి గీతాంజలి ప్రథమ బహుమతి రూ.10 వేలు, సత్తెనపల్లికి చెందిన కె.చందన ద్వితీయ బహుమతి రూ.7 వేలు, నరసరావుపేటకు చెందిన శ్రీలత తృతీయ బహుమతి రూ.5 వేలు, రావెల గ్రామానికి చెందిన సీహెచ్ మణిమంజరి నాలుగో బహుమతి రూ.3 వేలు గెలుచుకున్నారు. ప్రత్యేక బహుమతులను పది మందికి అందజేశారు. పోటీలలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి శంకర్ ఎంటర్‌ప్రైజెస్ నిర్వాహకులు గ్రంధి శంకరరావు చీరలను బహుమతిగా అందజేశారు. పోటీలలో న్యాయ నిర్ణేతలుగా గుంటూరుకు చెందిన జీ మల్లేశ్వరి, జె.శివపార్వతి, కె.భాగ్య, ఎం.సరస్వతి వ్యవహరించారు. కార్యక్రమంలో దుగ్గెంపూడి యోగేశ్వర్‌రెడ్డి, దొంత బ్రహ్మయ్య, తియ్యగూర శ్రీనివాసరెడ్డి ఇమిడాబత్తిన నాగేశ్వరరావు, సిద్దె రామయ్య, సన్ని, కోటు గోపిరెడ్డి, పెరకం విజయ్‌కుమార్, కర్పూరపు వీరాంజనేయులు పాల్గొన్నారు.

విద్యతో పాటు సామాజిక చైతన్యం అవసరం

ప్రముఖ పారిశ్రామికవేత్త జెట్టి శివరాం ప్రసాద్



ఉపకార వేతనాలను అందజేస్తున్న పారిశ్రామిక వేత్త జెట్టి శివరాం ప్రసాద్

పెదకాకాని: నేటి యువత ఉన్నత విద్య, ఉద్యోగాలతో పాటు సామాజిక చైతన్యాన్ని పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందని ప్రముఖ పారిశ్రామికవేత్త, గ్రీన్ సోల్ పవర్ సిస్టమ్స్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ జెట్టి శివరాం ప్రసాద్ అన్నారు. గ్రామ శివారులోని కౌండిన్యపురంలో కౌండిన్య ఐఏఎస్ అకాడమీ భవనంలో కౌండిన్య ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉపకార వేతనాల పంపిణీ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. సభకు కౌండిన్య ఎడ్యుకేషనల్ ట్రస్ట్, కౌండిన్య ఐఏఎస్ అకాడమీ వ్యవస్థాపకులు, చైర్మన్ డాక్టర్ ఈ. వి.నారాయణ అధ్యక్షత వహించారు. జెట్టి శివరాం ప్రసాద్ ప్రసంగాన్ని కొనసాగిస్తూ ఎంతో ప్రతిభ కలిగి ఆర్థికంగా వెనుకబడిన పేద, మధ్యతరగతి విద్యార్థులకు కౌండిన్య ఎడ్యుకేషనల్ ట్రస్ట్, ఐఏఎస్ అకాడమీలు సహకారం అందించడం ఎంతో అభినందనీయం అన్నారు. విశ్రాంత ఐఏఎస్ అధికారి పడమటి సుందర్ కుమార్ మాట్లాడుతూ యువత విద్యా ఉద్యోగాలతో పాటు ఉన్నత సామాజిక విలువలను అలవర్చుకోవాలన్నారు. విశ్రాంత ఐపీఎస్ అధికారి జక్కం శెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ యువత చెడు అలవాట్లకు, అనవసర ఫోన్ వినియోగానికి దూరంగా ఉండాలన్నారు. సభలో పాల్గొన్న కమర్షియల్ ట్యాక్స్ విశ్రాంత ఉన్నతాధికారి వై.సత్యనారాయణ మాట్లాడారు. సభకు డాక్టర్ ఈవీ నారాయణ అధ్యక్షత వహించారు. తొలుత వాకా రాంగోపాల్ గౌడ్ సభకు విచ్చేసిన అతిథులకు స్వాగతం పలికారు. సభానంతరం విద్యార్థులకు ఉపకార వేతనాలను అందించారు. కార్యక్రమంలో వడ్డేగుంట సుబ్బారావు,డాక్టర్ తాతా సాంబశివరావు, కారంకి లక్ష్మీనారాయణ, పామర్తి సాంబశివరావు, బొబ్బిళ్ల వెంకటేశ్వరరావు, చిలకా చంద్రమౌళి, డాక్టర్ టి సేవ కుమార్, బెల్లంకొండ సదాశివ గౌడ, డాక్టర్ ఎస్.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రెటినోపతిపై అప్రమత్తత అవసరం

నేత్ర వైద్య నిపుణులు డాక్టర్ శివాని



మాట్లాడుతున్న డాక్టర్ శివాని

గుంటూరు మెడికల్: మధుమేహాన్ని నిర్లక్ష్యం చేసిన కారణంగా చూపును కోల్పోతున్న వారి సంఖ్య చాలా ఎక్కువగా ఉంటుందని, వారిలో చాలామందికి రెటినోపతిపై శాస్త్రీయ అవగాహన లేకపోవడమే కారణమని అగర్వాల్ కంటి ఆస్పత్రి నేత్ర వైద్య నిపుణులు డాక్టర్ జి.శివాని పేర్కొన్నారు. బ్రాడీపేటలోని ఎస్‌హెచ్ఓ సమావేశ మందిరంలో ఎస్‌హెచ్ఓ హైబర్ టెన్షన్ అండ్ డయాబెటిక్ క్లబ్, మానవత స్వచ్ఛంద సేవా సంస్థ సంయుక్తంగా నిర్వహించిన రెటినోపతి ఉచిత పరీక్ష- వైద్య సలహా శిబిరం ఆదివారం నిర్వహించారు. సభకు మానవత స్వచ్ఛంద సేవా సంస్థ మెడికల్ క్యాంప్స్ చైర్మన్ టి.ధనుంజయ రెడ్డి అధ్యక్షత వహించారు. డాక్టర్ శివాని మాట్లాడుతూ కంటి వెనుక భాగంలో రెటీనా ఉంటుందని, ఇది కంటి చూపు విషయంలో కీలక పాత్ర పోషిస్తుందని చెప్పారు. రేటినోపతి ప్రారంభ దశలో ఉన్న ,తీవ్ర స్థాయిలో ఉన్న ఎలాంటి లక్షణాలు కనిపించవని చెప్పారు. చూపులో కూడా లోపాలు ఉండకపోవచ్చునన్నారు. అసాధారణ రక్తనాళాలు చిట్లినప్పుడే రక్తస్రావం జరిగి, కంటి లోపల రెటీనా భాగం విడిపోయి హఠాత్తుగా చూపును కోల్పోవడం జరుగుతుందని వివరించారు. అప్పుడు వారికి చికిత్స చాలా కష్టతరం అవుతుందన్నారు. అందువల్లనే మధుమేహ బాధితులు ప్రతి ఆరు నెలలకు ఒకసారి రెటీనా పరీక్షలు చేయించుకోవడం చాలా మంచిదని తెలిపారు. తొలిదశలోనే రెటినోపతిని గుర్తించి చికిత్స చేయడం ద్వారా కంటి చూపును కాపాడుకోవచ్చన్నారు. డాక్టర్ షేక్ మస్తాన్ వలి మాట్లాడుతూ మధుమేహం బారిన పడిన ప్రతి ఒక్కరూ రక్తంలో షుగర్ శాతాన్ని నియంత్రణలో ఉంచుకోవడం ద్వారా శరీరంలోని ప్రతి అవయవాన్ని కాపాడుకోవచ్చునన్నారు. కార్యక్రమంలో మానవత స్వచ్ఛంద సేవా సంస్థ చైర్మన్ పావులూరి రమేష్, కార్యదర్శి కె. సతీష్ కుమార్, ఎన్ సాంబశివరావు, మేకల రామారావు, టి.ఉమామహేశ్వరరావు, సుబ్రహ్మణ్యం, అగర్వాల్ కంటి ఆసుపత్రి సిబ్బంది పి.సుధాకర్, దంత వైద్య నిపుణులు డాక్టర్ చల్లా చైతన్య పాల్గొన్నారు. డాక్టర్ శివాని రెటినోపతి పరీక్షలు నిర్వహించి ఉచితంగా వైద్య సలహాలు అందజేశారు.

కార్పొరేట్ విద్యా సంస్థల అరాచకాలు ఆగడం లేదు

నెహ్రూనగర్: రాష్ట్రంలో ఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కార్పొరేట్ విద్యా సంస్థల అరాచకాలు మాత్రం ఆగడం లేదని రెవల్యూషనరీ విద్యార్థి సంఘం(ఆర్ఎస్‌యూ) రాష్ట్ర అధ్యక్షుడు రవిశంకర్‌రెడ్డి పేర్కొన్నారు. అంబేడ్కర్ భవన్‌లో నిర్వహిస్తున్న ఆర్ఎస్‌యూ రాష్ట్ర మహాసభల ఆదివారం ముగిశాయి. ఆయన మాట్లాడుతూ ఫీజులు పేరుతో కార్పొరేట్ విద్యా సంస్థలు దోచుకుంటున్నా విద్యాశాఖ అధికారులు వారిపై కనీస చర్యలు తీసుకోకపోవడం బాధాకరమన్నారు. ప్రభుత్వ విద్యకు అధిక ప్రాధాన్యం ఇవ్వడంతో పాటు... తగినన్ని నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఎ.శ్రీధర్, టి.ప్రశాంత్, అవినాష్, రాజేష్, శ్యామ్, హరిబాబు పాల్గొన్నారు.